




వైసీపీ నేత మోయిళ్ల సురేష్ రెడ్డి దౌర్జన్యం

ప్రజాశక్తి-నెల్లూరు :తాము దళితులమని రూరల్ పరిధిలోని జివిఆర్ఆర్ కళాశాల సమీపంలోని కళ్యాణ్ నగర్‌లో తాము 2022లో కొనుగోలు చేసిన స్థలంలోకి వచ్చి వైసిపి నేత మోయిళ్ల సురేష్ రెడ్డి దౌర్జన్యం చేస్తున్నారని వాదనాల రాజేష్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు కళ్యాణ్ నగర్ లోని స్థలం వద్ద ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ మొత్తం 62 అంకణాల స్థలానికి సంబంధించి తమ వద్ద అన్ని డాక్యుమెంట్లు ఉన్నాయన్నారు. వైసిపి నేత సురేష్ రెడ్డి ఫోన్లు చేస్తూ బెదిరిస్తున్నారన్నారు. గత మూడు సంవత్సరాల నుంచి తమకు రాజకీయ బలం ఉందని తమన అనేక రకాల ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. చింతా రెడ్డిపాలెం నుంచి వైసీపీ నేత ఆనం విజయకుమార్ రెడ్డి ఈ స్థలం వద్దకు వచ్చి అవాస్తవాలు మాట్లాడారని, తమది కూడా చింతా రెడ్డిపాలెం మేనన్నారు. వదనాల సల్మా మాట్లాడుతూ కళ్యాణ్ నగర్ లో తమ స్థలానికి సంబంధించి అధికారులు పాలకుల స్పందించి తగిన న్యాయం చేయాలని వైసిపి బెదిరింపుల నుంచి తమను కాపాడాలని విజ్ఞప్తి చేశారు.



ఒరిజినల్ పత్రాలు చూపుతున్న దృశ్యం

భయం వదిలేస్తే..జయం మీదే..!

పదో తరగతి పరీక్షలకు విద్యార్థులు సిద్ధమవుతున్నారు. అధికారులు ఇందుకోసం పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నారు. మంచి ఫలితాలతోపాటు, విద్యార్థుల్లో మనోధైర్యం నింపేలా పరీక్షలు నిర్వహించాలనే ఆలోచన చేస్తున్నారు. ఈనెల 17 నుంచి 31 వరకు పరీక్షలు జరగనున్నాయి. ఇప్పటికే ప్రశ్నాపత్రాలు జిల్లా కేంద్రానికి చేరుకున్నాయి. విద్యార్థులు భయం వదిలేస్తే. విజయం సాధిస్తారని ఉపాధ్యాయులు చెబుతున్నారు. మాల్ ప్రాక్టీస్‌కు తావులేకుండా, విద్యార్థులకు బెంచ్, ఫ్యాన్, వాటర్ వంటి కనీస వసతులు కల్పించేందుకు విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే కలెక్టర్ ఆధికారులు ఆదేశాలు జారీ చేశారు. జిల్లా వ్యాపితంగా 174 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. 33,434 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు. ఇందులో 16,250 మంది బాలికలు, 17184 మంది బాలికలున్నారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 వరకు జరగనున్నాయి. అరగంట ముందే పరీక్ష కేంద్రాలకు వెళ్లాల్సి ఉంటుంది. ఆర్‌టిసి బస్సులో విద్యార్థులకు ఉచిత బస్ సౌకర్యం కల్పిస్తున్నారు. హాల్ టికెట్ చూపిస్తే అనుమతిస్తారు. విద్యాశాఖ అధికారులు గొప్పలు చెబుతున్నా అనేక చోట్ల పరీక్షా కేంద్రాల్లో ఫ్యాన్, బెంచ్‌లు, సదుపాయాలు కనిపించడం లేదని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

◆17 నుంచి పది పరీక్షలు
◆అధికారులు పటిష్ట ఏర్పాట్లు



డిఇఒ కార్యాలయం (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

ఇలా చేయండి..విజయం సాధించండి..!

పదో తరగతి పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థులకు సీనియర్ ఉపాధ్యాయులు పలు సూచనలు చేస్తున్నారు. ఇలా చేస్తే మంచి ఫలితాలు వస్తాయని వారు చెబుతున్నారు. ప్రతి రోజూ రాత్రి 10 గంటల వరకు చదవుకోవడం, గతంలో చెప్పిన పాటలను ఒకసారి పరిశీలించాలి. ఉదయం 5 గంటలకు నిద్ర లేని మరోసారి పుస్తకాలు పట్టాలి. పరీక్షలంటే కొందరికి తెలియని భయం, ఆందోళన కనిపిస్తాయి. వీటికి అవకాశం ఇవ్వకుండా ప్రశాంతంగా పరీక్షా కేంద్రానికి వెళ్లాలి. రాత్రి సమయంలో నిద్రకు భంగం కలగకుండా చూడాలి. ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలు ఆ రోజు పరీక్షలకు సంబందించి ముఖ్యమైన అంశాలను పరిశీలించాలి. ఏదో చదవకుండా పక్కా వ్యూహంతో చదువుకోవాలి. పరీక్ష హాలు వద్దకు వెళ్లి వరకు పుస్తకాలు బట్టీపట్టకుండా ప్రశాంతంగా ఉండాలి. కాల కృత్యాలు తరువాత స్థానాలు చేసి, పరీక్షలకు సిద్ధం కావాలి. పరీక్షలు 9.30 నుంచి ప్రారంభం అవుతాయి. ఇంటి నుంచి బయల్దేరి సమయం పరీక్షా కేంద్రానికి వెళ్లే సమయం గుర్తించి, 8.45కే కేంద్రానికి చేరుకునేలా చూడాలి. 9 గంటలలోపే పరీక్షా కేంద్రానికి అనుమతిస్తారు. ఉదయం తీసుకొని అల్పాహారం ఇబ్బంది లేకుండా లైట్‌గా తీసుకోవాలి. పరీక్ష కేంద్రానికి ప్రశాంతంగా వెళ్లండి. ఉపాధ్యాయులకు నమస్కరించి, మీకు కేటాయించిన సీటులో కూర్చోండి. మీ పేరు, హాల్ టికెట్ నెంబర్, సరిచూసుకోవాలి. అందుకు అనుగుణంగా రాశామా లేదా చూసుకోవాలి. జవాబు పత్రాలు తీసుకొని మార్జిన్ కొట్టి, తొలుత ప్రశ్నాపత్రం బాగా చదవాలి. తొలుత చదువుకొని, బాగా తెలిసిన ప్రశ్నలకు జవాబు రాయాలి. తప్పులు లేకుండా రాయడం మంచిది. ప్రతి ప్రశ్నకు సంఖ్య, సెక్షన్ రాయండి, చివరికి తెలియని ప్రశ్నలకు జవాబు రాయండి, ప్రతి పక్షకు జవాబు రాయాలి. చివరి 15 నిమిషాలకు ఒక్కసారి మొత్తం ప్రశ్నలు, రాసిన జవాబులు పరిశీలించండి. బిట్ పేపర్ ఇవ్వడానే నెంబర్ రాయడం, దారంతో కుట్టడం మర్చిపోవద్దు. చివరి నిమిషం వరకు హాల్ నుంచి బయటకు రావద్దు. అన్ని విషయాలు పరిశీలించి, పూర్తయ్యింది. అనుకున్న తరువాతే హాల్ నుంచి బయటకు రండి. ఇంటికి వచ్చిన తర్వాత భోజనం చేసి, ఒక్కసారి మీరు రాసిన జవాబులు చూసుకోండి,. తరువాత పరీక్షలకు సిద్ధం కండి. ఎక్కడా పొరపాటు జరగకుండా, ప్రశాంతంగా చదువుకున్నది రాయండి, ఇలా చేస్తే విజయం మీ సొంతం అవుతుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. వీటిని పాటిస్తే పంచి ఫలితాలు వస్తాయి..



శ్రీనివాస కళ్యాణోత్సవానికి సిఎంకు ఆహ్వానం

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి అమరావతిలోని వెంకటపాలెంలోని వెంకటేశ్వం స్వామివారికి శనివారం నిర్వహించనున్న కల్యాణోత్సవంలో పాల్గొనాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడుని... తిరుమల తిరుపతి దేవస్థానం ఛైర్మన్ బి.ఆర్ నాయుడు, ఆలయ ఇఒ శ్యామలరావు, జేఈఒ వెంకన్న చౌదరి, బోర్డు మెంబర్, కోవూరు ఎమ్మెల్యే శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఇతర సభ్యులు ప్రత్యేకంగా ఆహ్వానించారు. శుక్రవారం సిఎం చంద్రబాబు నాయుడుని ఉండవల్లిలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. శ్రీనివాస కళ్యాణోత్సవానికి సిఎంను ఆహ్వానించారు.

గూడూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A.NO. 552, 553 మరియు 554 / 2023,
O.S.NO.210/ 2019

వడ్లమూడి సావిత్రి ...పిటిషనరు

Vs

1. బొల్లినేని వెంకటరత్నం నాయుడు (Died) మరియు ఇతరులు ....రెస్పాండెంట్లు

నోటీసు

To R3- బొల్లినేని లోహిత్
S/o లేట్ వెంకటరత్నం నాయుడు
R4-బొల్లినేని హర్షిణి,
D/o లేట్ వెంకటరత్నం నాయుడు
27-1-541, యస్‌వియస్ అపార్టుమెంటు, ఫ్లాట్ నెం.401, 16వ క్రాస్ రోడ్డు, బాలాజినగర్, నెల్లూరు నగరం.

పిటిషనరు / వాది పై నెంబరు పిటిషన్లు మిమ్మల్ని పై దావాలో లేట్ వెంకటరత్నం నాయుడు వారసులుగా చేర్చుటకు వేసియున్నందున మీకు తే.24-03-2025 దిన వాయిదా ఉన్నందున, మీరు పై కోర్టులో సదరు తేదిన ఉదయం 10 గం॥లకు హాజరై మీకు గల ఆక్షేపణలు తెల్పుకోని యెడల మీ పరోక్షమున పిటిషన్లు తీర్మానించబడునని తెలియజేయడమైనది.

వాయిదా తేది: 24-03-2025

ఇట్లు,
పి. భాస్కర్‌రావు,
అడ్వకేట్, గూడూరు.

రూ.24 కోట్లతో జిజిహెచ్ లో క్రిటికల్ కేర్ యూనిట్



మాట్లాడుతున్న రూరల్ ఎంఎల్ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

-ప్రజాశక్తి- నెల్లూరు

రూరల్ నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ ప్రధాన వైద్యశాలలో రూ.24 కోట్లతో నిర్మిస్తున్న 50 పడకల క్రిటికల్ కేర్ యూనిట్ పనులను రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి పరిశీలించారు. శుక్రవారం ఆయన ప్రభుత్వ ప్రధాన వైద్యశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ క్రిటికల్ కేర్ యూనిట్ జిల్లాకే తలమానికం అత్యంత ఆధునిక వసతులతో ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ క్రిటికల్ కేర్ యూనిట్ వల్ల ప్రజలకు మేలు జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జూలై 30వ తేదీ లోపల దీనిని పూర్తిచేసి, వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్, జిల్లా మంత్రులు పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణ రెడ్డి , నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి దీనిని ఘనంగా ప్రారంభించి ప్రజలకు అంకితం చేస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేస్తున్న కృషికి ప్రజలందరి ఆశీస్సులు ఉండాలని కోరారు. కార్యక్రమంలో జిజిహెచ్ అభివృద్ధి కమిటీ సభ్యులు, వైద్యాధికారులు, సిబ్బంది, పాల్గొన్నారు.

రసూల్ కుటుంబానికి ఆర్థిక చేయూత

ప్రజాశక్తి -ఉలవపాడు

ఇటీవల అనారోగ్యంతో ఉలవపాడు చెందిన వైసిపి కార్యకర్త షేక్ రసూల్ బాషా ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. శుక్రవారం రసూల్ కుటుంబానికి వైఎస్ఆర్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కేశవరపు జాలిరెడ్డి 20 వేల రూపాయలు ఆర్థిక చేయూత అందించారు.రసూల్ తండ్రి ఆర్నెల్ల క్రితం మృతి చెందారు . మరో నెల గడవకముందే రసూల్ మృతి చెందాడు. ప్రస్తుతం రసూల్ భార్య అనారోగ్యం తో ఉలవపాడు లోని శ్రీశ్రీ వైద్యశాల లో ఆపరేషన్ చేయగా. జాలిరెడ్డి వైద్యశాల వెళ్లి ఆ కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక ఆర్థిక సహాయం అందజేశారు.వీరి వెంట వైసిపి మండల అధ్యక్షులు పోతురాజు, వైస్ ఎంపీపీ సయ్యద్ ఫజుల్, నియోజకవర్గ యూత్ అధ్యక్షులు నవీన్, వార్డ్ సభ్యులు రసూల్ పలువురు నాయకు లున్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

గంజాయిపై ప్రభుత్వం ఉక్కుపాదం..!

-విస్తుపోతున్న మండల ప్రజలు..

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

గంజాయి మాఫియాపై రాష్ట్ర ప్రభుత్వం ఓవైపు ఉక్కుపాదం మోపు తున్న విషయం తెలిసిందే. ఈ మేరకు ప్రభుత్వానికి సహకరించా ల్సిన కొందరు అందుకు భిన్నంగా గంజాయి మాఫియాకు అండగా నిలుస్తున్నారు. రెండు రోజుల క్రితం చోటుచేసుకున్న ఓ సం ఘటన అందుకు నిలువెత్తు నిదర్శ నమని చెప్పొచ్చు. ప్రజలను విస్తు గొలుపుతున్న కొందరి తీరు గురించి సేకరించిన మేరకు వివ రాల్లోకి వెళితే.. మండలంలోని కోడూరు సముద్ర తీరం లో గంజాయి సేవిస్తూ పర్యాటకుల పట్ల అసభ్యకరంగా వ్యవహరిస్తున్న ముగ్గురు యువకులను స్థానిక టీడీ పీ నాయకులు కొందరు పట్టుకొని పోలీసు స్టేషన్లో అప్పగించారు. దాంతో తెలుగు తమ్ముళ్ల తెగువను ప లువురు అభినందించారు. ఎందు కంటే పోలీసులు చేయాల్సిన పనిని తమ్ముళ్ళు చేశారు కాబట్టి. అయితే తెలుగు తమ్ముళ్ళు పట్టించిన గంజా యి బ్యాచ్ పై కఠిన చర్యలు తీసుకోవాల్సిన పోలీసులు విడిచి పెట్టేయ డం విమర్శలకు దారితీసింది. మండలంలో గంజాయి బ్యాచ్ ఆగడాలు హద్దులు మీరుతున్నాయి. రాత్రివేళల్లో యువత విచ్చలవి డిగా తిరరుగుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ దారిన పోయే వారిపై దాడి చేస్తున్న ఘటనలలే కాకుండా దొంగతనాలు కూడా చోటు చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో ఉక్కుపాదం మోపాల్సిన పోలీసులు రాజకీయ ఒత్తిడులు వచ్చాయనో, లేదా ఇతరత్ర కారణాల వల్లనో గంజాయి బ్యాచ్ విషయం లో ఉదాసినంగా వ్యవహరించడం పై విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి. ఇటీవల రాష్ట్రంలో గంజాయి విని యోగం విపరీతంగా పెరిగిపోయింది. తాము అధికారంలోకి వస్తే గం జాయిపై ఉక్కుపాదం మోపుతామని ఎన్నికల సమయంలో టిడిపి నాయకులు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ మేరకు నాడు వారు చెప్పినట్టుగానే గంజాయి సాగు, విక్రయం, రవా ణా, వినియోగంపై పూర్తి స్థాయిలో ఉక్కుపాదం మోపాలని కూటమి ప్ర భుత్వం నిర్ణయిం చింది. స మాజ శ్రేయస్సు కోసం తమ ప్రభు త్వం చేస్తున్న ఈ ప్రయ త్నానికి తమ వంతు సహకారం అందించాల్సి న ఆ పార్టీ నాయకులు, పోలీసులు అడ్డుతగులు తుండడం విడ్డూరం. ఏదేమైనా గంజాయి బ్యాచ్ ను పో లీసులకు పట్టించిన వారే విడిపిం చుకు పోవడం, అందుకు పోలీసు లు సహకరించడం మండలంలో పలువురు చర్చించు కుంటున్నారు.






రూ.50 లక్షలతో ల్యాబ్‌కు శంకుస్థాపన

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని సౌత్ మోపూర్ గ్రామంలో రూ. 50 లక్షల రూపాయల వ్యయంతో పిహెచ్‌సి సెంటర్‌లో ల్యాబ్ బిల్డింగ్ పనుల శుక్రవారం టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సౌత్ మోపూర్ గ్రామ ప్రైమరీ హెల్త్ సెంటర్ ఇప్పటికే అనేక గ్రామాలకు వైద్య సేవలు అందిస్తుందని, నాలుగు నెలల్లో ల్యాబ్ బిల్డింగ్ పనులన్నీ పూర్తి చేసి ల్యాబ్ ను ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు , డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సహాయసహకారాలతో నెల్లూరు రూరల్ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి నాయకత్వంలో నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో అభివృద్ధి పనుల జాతర సాగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఇందుపూరు శ్రీనివాసులు రెడ్డి, పోలయ్య, ఎంపీటీసీ రాపూరు చెంచమ్మ,తదితరులు పాల్గొన్నారు.

శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో కవితల పోటీ

ప్రజాశక్తి-కందుకూరుపఐఎస్ఒ గుర్తింపు పొంది నిరంతరం కవులను ప్రోత్సహిస్తూ, తెలుగు భాషా సాహిత్యాన్ని ప్రపంచ వ్యాప్తంగా పరిఢవిల్లేలా చేస్తున్నా శ్రీ శ్రీ కళా వేదిక ప్రపంచ కవితా దినోత్సవం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ శ్రీ కళా వేదిక సిఈఓ డా.కత్తిమండ ప్రతాప్ సారథ్యంలో నగదు బహుమతుల కవితల పోటీ నిర్వహించడం జరుగుతోందని శ్రీశ్రీ కళావేదిక జాతీయ జాతీయ అధ్యక్షురాలు జి. ఈశ్వరీభూషణం ఒక ప్రకటనలో తెలిపారు.సామాజిక ఇతివృత్తం కలిగిన అంశం తీసుకుని కవిత రాయవలసి ఉంటుందని, ఈ పోటీలో మొదటి బహుమతి: రూ. 2000 ,రెండవ బహుమతి:రూ.1500 ,మూడవ బహుమతి:రూ.1000 ,నాల్గవ బహుమతి:రూ.600,పది కన్సోలేషన్ బహుమతులు. ఒక్కొక్కరికి 500 వంతున ఇవ్వడం జరుగుతుందని ఆమె తెలిపారు. ఈ కవితల పోటీలో పాల్గొనదలచిన వారు ఈ 82475 19925, 93816 02177, 98664 81047 నంబర్లను సంప్రదించాలని కోరారు. నగదు బహుమతులు గెలుచుకున్నవారికి ఈ నెల 23 వ తేదీన రాజమహేంద్రవరం లో జరుగు సాహిత్య సదస్సులో అందించడం జరుగుతుంది. కవిత పంపవలసిన ఆఖరు తేది మార్చి 16.న ఈ అవకాశం కవులు ఉపయోగించుకోవాలని ఈశ్వరీభూషణం తెలియజేశారు.



పరిశీలిస్తున్న ట్రైనీ డిఎస్‌పి

రెండు ఇళ్లల్లో చోరీకి యత్నం

ప్రజాశక్తి-కోవూరు

తాళాలు వేసి వేరే ఊరికి వెళ్లారా ఇక మీ పని అంతే.. తాళాలు వేసి సుధూర ప్రాంతాలకు వెళ్లిన ఇళ్లనే టార్గెట్ చేస్తూ దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఓవైపు పోలీసులు ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లే సమయంలో తప్పనిసరిగా సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని చెప్పినా ఎవరూ ఆశించిన మేర స్పందించడం లేదు. ఫలితంగా దొంగతనాలు జరుగుతూనే ఉన్నాయి. తాజాగా గురువారం రాత్రి కోవూరులోని ప్రభుత్వాస్పత్రి సమీపంలో రిటైర్డ్ ఉపాధ్యాయుడు వరప్రసాద్ ఇళ్లు, బ్రహ్మదేవి లక్ష్మి ఇళ్లను గుర్తు తెలియని దొంగలు టార్గెట్ చేశారు. ఈ రెండు ఇళ్లల్లో గత నెల రోజులుగా విజయవాడ, హైదరాబాద్‌లలో ఈ ఇంటి యజమాని ఉంటున్నారు. దీనిని గుర్తించిన గుర్తు తెలియని దొంగలు రెండు ఇళ్లల్లో తాళాలు పగలగొట్టి బెడ్‌రూంలోని వస్తువులను చిందరవందరగా చేశారు. వారికి ఈ రెండు ఇళ్లల్లో నగదు, నగలు దొరకకపోవడం గమనార్హం. రిటైర్డ్ టీచర్ వరప్రసాద్ ఇంట్లో మాత్రం రూ. 5 వేలు నగదు చోరీకి గురైంది. చోరీకి వచ్చిన ఈ గుర్తు తెలియని దొంగలు ఇద్దరు స్కూటీలో వచ్చినట్లు సీసీ కెమెరాలో కనిపిస్తోంది.. వీరు వెళ్తూ వెళ్తూ ఆ ప్రాంతంలో పార్క్ చేసి ఉన్న మోటార్ సైకిల్ హ్యాండ్ లాక్ పగలగొట్టి తస్కరించుకుపోయారు. ఈ మేరకు బాధితులు శుక్రవారం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సంఘటనా స్థలాన్ని ట్రైనీ డిఎస్‌పి శివప్రియ పరిశీలన చేపట్టారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

దోమల బెడద నివారించాలి



నెల్లూరు రూరల్ 32 డివిజన్‌లో



బొల్లినేని సెంటర్‌లో



అనంతసాగరంలో



కందుకూరులో

ప్రజాశక్తి-నెల్లూరు

స్థానిక 32 వ డివిజన్ డైకస్ రోడ్ సెంటర్ లో ప్రజా చైతన్య యాత్ర కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ప్రజలు నిత్యం దోమల బెడద వల్ల విషం జ్వరాల పాలవుతున్నామని, డ్రెయినేజీ సమస్య తీవ్రంగా ఉందని, అర్హత ఉన్నా పింఛన్లు, రేషన్ కార్డులు ఇవ్వలేదని ఇళ్ల స్థలాలు, ఇళ్ల పట్టాలు సమస్యలు పరిష్కారం చేయాలని, కరెంట్ ఛార్జీల భారాన్ని తగ్గించాలని కోరారు.కార్యక్రమంలో సిపిఎం రూరల్ సెక్రటరీ సభ్యులు కె.ప్రసాద్, రూరల్ కమిటీ సభ్యులు షేక్ ఖలీల్, కండే కోటేశ్వ రరావు, మహిళా శాఖ కార్యదర్శి రాజేశ్వరమ్మ, నాయకులు టీచర్ రమణయ్య, షానవాజ్, బాజావలి, మన్సూర్,తదితరులు పాల్గొన్నారు.

36 డివిజన్‌లో

సిపిఎం రాష్ట్రవ్యాప్తంగా జరుగుతోన్న ప్రజా చైతన్య యాత్రలో భాగంగా శుక్రవారం 36వ డివిజన్‌లో సిపిఎం స్థానిక శాఖ ఆధ్వర్యంలో జనచైతన్య యాత్ర ప్రారంభించారు. నెల్లూరు రూరల్ కార్యదర్శివర్గ సభ్యులు కొండాప్రసాద్ జనచైతన్య యాత్ర ప్రాముఖ్యతను, కూటమి ప్రభుత్వ వైఫల్యాలు, స్థానిక సమస్యలతో ప్రజలు పడే ఇబ్బందులు, పరిష్కాతాలు వివరించారు..కార్యక్రమంలో సిపిఎం రూరల్ కమిటీ సభ్యులు నందిపాటి మాలకొండయ్య, వై. ఈశ్వరయ్య, షఫీ, గయాజ్, పుల్లయ్య, గోపాల్, ఖాదర్ బాషా, వై రమేష్, ఎన్. మధుబాబు, ఖాదర్ బాషా పాల్గొన్నారు.

ప్రజాశక్తి-అనంతసాగరం

సిపిఎం ఆధ్వర్యంలో ప్రజా చైతన్యయాత్ర నిర్వహించడం జరిగింది. గుంత బజార్, చిన్న గుండం, నడివిధి, పీరుసాహెబ్ పేట ఏరియాలో సిపిఎం నాయకులు తిరిగి ప్రజల సమస్యలను తెలుసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శవర్గ సభ్యులు మంగళ పుల్లయ్య మాట్లాడుతూ గ్రామాలలో ఉండే సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిపిఎం ప్రతి గ్రామాల్లో ఇంటింటికి తిరిగి సమస్యలను గుర్తించడం జరుగుతుందన్నారు.కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి అన్వర్ బాషా, మండల కమిటీ సభ్యులు వేము పెంచలయ్య, గాడి సుధాకర్, జక్కరయ్య, వెంకటేష్, మెడితాటి నరసింహులు, మీరా మొహిద్దీన్ పాల్గొన్నారు.

మల్లయ్యగుంటలో

30వ డివిజన్ కొత్తూరు మల్లయ్యగుంటలో స్థానిక శాఖ ఆధ్వర్యంలో ప్రజా చైతన్య యాత్రలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి ప్రజా సమస్యలు తెలుసుకోవడం జరిగింది. కార్యక్రమంలో శాఖ కార్యదర్శి కండె కోటేశ్వరరావు శాఖ సభ్యులు హమీద్, నరికే దశరథ రామయ్య, మహిళా సంఘం నాయకులు రాజేశ్వరమ్మ, ఇంద్రజ కుమారి, తిరుపతమ్మ, పెంచలమ్మ, అంజమ్మ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కందుకూరు

సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో 20వ వార్డు పరిసర ప్రాంతాలలో ప్రజా చైతన్య యాత్ర కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ నాయకులు ఎస్‌ఏ గౌస్, ఎస్‌కె మల్లికా, ఎస్ పవన్ కుమార్, ఎం పద్మ, డి ఎం రాయుడు పాల్గొన్నారు. మంచినీళ్లు సరిపడా రావడం లేదని , తక్కువ సమయం వస్తున్నాయని ప్రజలు తెలిపారు. నివాసం ఉంటున్న కొన్ని ఇళ్లల్లో వాడుకోవటానికి బోర్లు ,బావుల వసతి ఉన్నది. ఎక్కువమంది నీటి కోసం మున్సిపల్ బోర్ల మీద ఆధారపడుతున్నారు. మున్సిపాలిటీ బోర్లన్నీ చెడిపోయి శిధిలావస్థకు చేరినవి .ఒక బోరు ఆంజనేయ స్వామి గుడి దగ్గర ఉంటే ఆ నీళ్లల్లో మురికినీళ్లు వాసన వస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి ఎస్‌ఎ గౌస్ మాట్లాడుతూ మున్సిపాలిటీ వారు ప్రజల వద్ద పన్నుల రూపంలో వసూలు చేస్తున్న డబ్బులు ఏమైపోతున్నయి ఎటు పోతున్నాయి ఎవరి అభివద్ధికి ఖర్చు చేస్తున్నారు అని అన్నారు. పై సమస్యల పరిష్కారం కోసం మున్సిపాలిటీని ముట్టడిస్తావని తెలిపారు.

కష్టపడితే ఫలితాలు మీ వెంటే



విద్యార్థితో మాట్లాడుతున్న ట్రైనీ డిఎస్‌పి

ప్రజాశక్తి-కోవూరు

పదవ తరగతి అనేది విద్యార్థి జీవితంలో అత్యంత కీలకమని ఈ దశలోనే ప్రతి విద్యార్థి కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే ఫలితాలు మీవెంట పరుగులు తీస్తాయని ట్రైనీ డిఎస్‌పి శివప్రియ తెలిపారు. కోవూరులోని సాంఘిక సంక్షేమ వసతి గృహ సముదాయ సమావేశ మందిరంలో శుక్రవారం కోవూరు ఎఎస్‌ఈడబ్ల్యూ పరిధిలోని 7 వసతి గృహాల్లో విద్యనభ్యసిస్తున్న 80 మంది పదవ తరగతి విద్యార్థులకు పెద్ది ప్రభావతి చారిటబుల్ ట్రస్టు ద్వారా వాచ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం పదవ తరగతి విద్యార్థులు ఆందోళన చెందకుండా మానసిక ఒత్తిడికి గురి కాకుండా పరీక్షలు రాయాలని పిలుపునిచ్చారు. ఒక ప్రశ్నకు ఎంత సమయం సరిపోతుందో సరి చూసుకుని తద్వారా జవాబులు రాయాలన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం శక్తి యాప్ ప్రవేశపెట్టిందని, అత్యవసర సమయాల్లో ఈ యాప్ ఆడపిల్లలకు ఉపయోపడుతుందన్నారు. ఈ యాప్‌ను తమ తల్లిదండ్రుల సెల్లో ఇన్స్టాల్ చేసుకోవాలన్నారు. ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ నరసింహమూర్తి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని ఎంచుకుని దానిని సాధించాలనే పట్టుదలతో ముందుకు సాగినప్పుడే అద్భుతమైన ఫలితాలు వస్తాయన్నారు. ఈ ట్రస్టు ద్వారా ఇప్పటికే నిర్వాహకులు అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. ఇందుకు ట్రస్టు నిర్వాహకులు పెద్ది మారుతీ నాగార్జున, సత్యవతిలను ప్రత్యేకంగా అభినందిస్తున్నామన్నారు. సమయపాలన సాధించి నూరుశాతం ఫలితాలు సాధించాలన్నారు. కోవూరు ఏఎన్ డబ్ల్యూ తిరుపతయ్య మాట్లాడుతూ సంక్షేమ వసతి గృహంలో చదువుతున్న విద్యార్థులు దాతలు ఇచ్చిన సదుపాయాలను సద్వినియోగం చేసుకుని నూరుశాతం ఫలితాలు సాధించాలన్నారు. సోమవారం నుంచి పరీక్షలు జరగనున్న నేపథ్యంలో పరీక్షా నిర్వాహకులు ఇటువంటి మంచి కార్యక్రమాలు చేపట్టడం విద్యార్థులకు మరింత ధైర్యాన్ని అందించిందన్నారు. కోవూరు ఎస్ఐ రంగనాథ్ గౌడ్ మాట్లాడుతూ పెద్దలు ఇచ్చిన ఈ సూచనలను ప్రతి విద్యార్థి తప్పక పాటించాలన్నారు. సోషల్ మీడియా మొబైల్ పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ వయస్సులో సెల్ఫోన్ జోలికి వెళ్తే అత్యంత ప్రమాదకరమని సూచించారు. ట్రస్టు నిర్వాహకులు ఇటువంటి మంచి కార్యమ్రకం చేపట్టడం ఇతరులకు స్ఫూర్తిదాయకమని, దీనిని నిరంతరం కొనసాగించాలని నిర్వాహకులకు సూచించారు.కార్యక్రమంలో సంక్షేమాధికారులు వెంకటయ్య, వెంకట్రావ్, రాంబాబు, పద్మ, సుప్రజ, జ్యోతిరాణిలు పలు సూచనలు చేశారు.



ప్రజాశక్తి-కావలి : సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ప్రజా సమస్యలపై ప్రజా చైతన్య యాత్ర శుక్రవారం 6వ రోజు పట్టణంలోని ఇందిరానగర్, కళ్యాణ మండపం, వినాయక స్ట్రీట్ ప్రాంతాలలో సిపిఎం కార్యకర్తలు ప్రతి ఇంటికి కరపత్రాన్ని ఇచ్చి, ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రజలు తెలియజేస్తూ కరెంటు బిల్లులు చాలా ఎక్కువ వస్తున్నాయని ఇంటి పన్నులు ఎక్కువ వస్తున్నాయని ఇది చాలా భారమైన పరిస్థితి అని తెలిపారు. కూలీ పనులు చేసుకునే పేదలను, ఇంత ఎక్కువ కరెంటు బిల్లు,ఇంటి పన్నులు వస్తే కట్టలేని పరిస్థితి ఉందన్నారు. ప్రభుత్వం ఆలోచించాలని ఇందిరా నగర్ కు సుమారు పది సంవత్సరాలుగా మునిసిపల్ నీటి సరఫరా లేదన్నారు. ఎన్నిసార్లు మునిసిపల్ అధికారులను అడిగినప్పటికీ ఎక్కువ ప్రాంతమైనందున వారు రాదని చెప్తారన్నారు. నీటి సరఫరా పూర్తిగా లేనందున నీటి కొరకు ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఒకపక్క పెరిగిన ధరలతో కొని, తినలేని పరిస్థితులు ఉన్నాయన్నారు. మరోపక్క కరెంటు ఛార్జీలు, ఇంటి పన్నులు పెంచి ప్రజలపై భారాలు వేస్తున్నారన్నారు. దీనివలన చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. సిపిఎం నాయకులు మాట్లాడుతూ ఎన్నికల్లో ఎన్నికల అప్పుడు ప్రజలకు ఎన్నో వాగ్దానాలు చేసిందని,ఇచ్చిన హామీలు అమలు చేయకుండు ప్రజలు ప్రభుత్వంపై ఒత్తిడితీసుకురావాలని పిలుపునిచ్చారు. కరెంటు బిల్లులు, ఇంటి పన్నులు తగ్గించేంత వరకు ప్రజలు పోరాడాలని కోరారు. మీ పోరాటాలకు సిపిఎం పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య, పట్టణ కమిటీ సభ్యులు వై కృష్ణ మోహన్, బి. కృష్ణయ్య నాయకులు కే చెన్నయ్య, బి.రమణయ్య, పి. పెద్దనరసింహ తదితరులు పాల్గొన్నారు.

కనుమరుగవుతున్న పంట కాలువలు

ప్రజాసమస్యలు తెలుసుకునేందుకు పలుచోట్ల నిర్వహించిన ప్రజా చైతన్య యాత్రల్లో సిపిఎం నేతలు



కోవూరులో...

ప్రజాశక్తి-కోవూరు

పట్టణంలోని పంట కాలువలు రోజురోజుకు కనుమరుగవుతున్నాయని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జొన్నలగడ్డ వెంకమరాజు తెలిపారు. ప్రజా సమస్యల సాధన కోసం జరుగుతోన్న సిపిఎం ప్రజాచైతన్యయాత్ర శుక్రవారం ఏడో రోజుకు చేరింది. ప్రజా చైతన్య యాత్ర సందర్భంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జొన్నలగడ్డ వెంకమరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఎక్కువగా పంట కాలువలు కనుమరుగవుతున్నాయన్నారు. ఈ పంట కాలువలను డ్రైనేజీలుగా ఉపయోగిస్తున్నారని తెలిపారు. దాంతో దోమలు స్వైర విహారం చేస్తున్నాయన్నారు. పారిశుధ్య మెరుగునకు ఎక్కువగా కృషిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అదే విధంగా దోమల నివారణకు వాడే లిక్విడ్ ఖర్చుకూడా భారమైందన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దోమల నివారణకు ఆయిల్ బాల్స్, ఫాగింగ్ లాంటివి ఉపయోగించాలన్నారు. సైడ కాలువల్లో పూడికలు తీయాలన్నారు. తీసిన వెంటనే బ్లీచింగ్ చల్లే విధంగా చూడాలన్నారు. ఇటీవల దోమలు కుట్టడంతో విషజ్వరాలు ప్రబలుతున్నాయన్నారు. ఆస్పత్రులకు వెళితే వేల రూపాయలు ఖర్చు చేస్తున్నారన్నారు. మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా ఉందన్నారు. పట్టణంలో కుక్కల బెడద ఎక్కువగా ఉందన్నారు. ద్విచక్ర వాహనదారులను, వృద్ధులను, పిల్లలను కరుస్తున్నాయన్నారు. దాంతో కొందరికి గాయాలైన సందర్భాలున్నాయన్నారు. వీటిని దూర ప్రాంతాలకు తరలించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కోవూరు బజార్ సెంటర్ చాలా ఇరుకుగా ఉందన్నారు. వెంటనే రోడ్డు వెడల్పు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ధాన్యం ఆరబోసుకొనుటకు కల్లాలు లేవన్నారు. రైతులు ధాన్యాన్ని దాచుకోవడానికి ఇబ్బందికరంగా ఉందన్నారు. కోవూరు నియోజకవర్గం మొత్తమ్మీద కోట్ల రూపాయల విలువ చేసే గోదాములు నిర్మాణం జరిగినా రైతులకు ప్రయోజనకరంగా లేవని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రత్యేక దృష్టిని పెట్టి ధాన్యం ఆరబోసేందుకు కల్లాలకు స్థలాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రజల సమస్యల పరిష్కరించే వరకూ పోరాటం చేసేది ఒక్క సిపిఎం మాత్రమే అన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గండవరపు శేషయ్య, నాయకులు ఎస్కే బాబు, పాలెమా, చాన్‌బాషా, పూలకురు వెంకటరమణయ్య, పెద్దబ్బయ్య, రామిరెడ్డి వెంకటేశ్వర్లు, గండవరపు సురేష్, హరి, ఎస్కె ఎజ్జాని, అంకెం సురేష్, తదితరులు పాల్గొన్నారు.



ఉదయగిరిలో...

ప్రజాశక్తి-ఉదయగిరి : సిపిఎం ఆధ్వర్యంలో మూడు రోజులపాటు ఉదయగిరి, సీతారాంపురం, వరికుంటపాడు మండలాలలో చేపట్టే ప్రజా చైతన్య యాత్రను మొదటగా ఉదయగిరి నుండి ప్రారంభించినట్లు ప్రాంతీయ కార్యదర్శి కొండ రమణయ్య తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం స్థానిక బస్టాండ్ సెంటర్లో కార్యక్రమాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలు కావస్తున్నా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. అందులో భాగంగా మూడు మండలాలలో ప్రజలను చైతన్యవంతులు చేసేందుకు ఈ యాత్రను ప్రారంభిస్తున్నామని రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరు పాల్గొని గ్రామంలో తలెత్తే సమస్యలను తమ ముందుకు తీసుకురావాలని తమ ఇబ్బందులను అధికారులకు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. అనంతరం రైతు సంఘ నాయకులు కాకు వెంకటేష్ మాట్లాడుతూ వెలుగొండ సీతారాం సాగర్ పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయర్లకు నిధులు కేటాయించి వెంటనే పూర్తి చేయాలని వారు డిమాండ్ చేశారు. శాశ్వత కరువు నివారణకు వలస నివారణకు ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. ముఖ్యంగా ప్రజా చైతన్య యాత్రలో తమ ముందుకు వచ్చిన సమస్యలపై ప్రజల ముందుకు వస్తున్నామని మరికొన్ని సమస్యలపై ప్రతి గ్రామం నుండి తెలుసుకునేందుకు ప్రతి మండలంలో ఇంటింటా తిరిగి సమస్యలను తెలుసుకుంటామన్నారు. ముఖ్యంగా కరువు ప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గంలో 250 రోజులు ఉపాధిహామీ పనులు కల్పించి రోజుకు రూ.600 వేతనం ఇవ్వాలన్నారు. వెలుగొండ ప్రాజెక్టు పూర్తి చేసేందుకు అవసరమైన నిధులు కేటాయించి పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయరు పూర్తి చేయాలన్నారు. గండిపాళెం, మర్రిపూట్ల వాగు రిజర్వాయర్లు, స్వామి చెరువుల మరమ్మతులు చేయించి ఆధునికీకరించాలన్నారు. నియోజకవర్గాన్ని శాశ్వత కరువు నుండి కాపాడేందుకు మాజీ సిఎం ఎన్.టి. రామారావు మంజూరు చేసిన సీతారాంసాగర్ నిర్మాణం చేపట్టాలన్నారు. వ్యవసాయానికి బోర్లు, అంతర్గత బోర్లు వేసుకుంటామని కోరిన రైతులు ప్రభుత్వమే ఉచితంగా బోర్లు వేసి సబ్సిడీపై మోటార్లు ఇచ్చి విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలన్నారు. ముఖ్యంగా ఉదయగిరి, బండగానిపల్లి ఘాట్రోడ్డు నిర్మాణంతో పాటు నందవరం – ఉదయగిరి రోడ్డును డబుల్రోడ్డుగా చేయాలన్నారు. ఉదయగిరి – సీతారాంపురం, వరికుంటపాడు మండలాలకు సోమశిల నుండి తాగునీటిని పైపుల ద్వారా అందించాలన్నారు. 9 గంటలు కరెంటు ఇచ్చి కాలిపోయిన ట్రాన్స్ఫార్మర్లను ప్రభుత్వ ఖర్చుతో మరమ్మత్తులు చేసి 24 గంటలలో బిగించాలన్నారు. స్థానిక జూనియర్, డిగ్రీ కాలేజీ బాలురకు ప్రభుత్వ హాస్టల్ ఏర్పాటు చేయాలని తదితర డిమాండ్లను ప్రభుత్వ దృష్టికి తెచ్చి పరిష్కారం కోరేందుకు ప్రజలందరూ కలిసి రావాలని కోరారు.



వింజమూరులో...

ప్రజాశక్తి-వింజమూరు : మండల పరిధిలోని మునిపల్లి గ్రామంలోని హరిజనవాడలో శుక్రవారం సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు తుళ్ళూరు గోపాల్ ఆధ్వర్యంలో మండలంలోని సిపిఎం నాయకులు కార్యకర్తలతో కలిసి గ్రామంలో ఎదుర్కొంటున్న సమస్యలపై పరిశీలన చేసి లోపంతో ఉన్న గ్రామాన్ని మెరుగుపరచాలని అధికారులకు తెలియజేశారు. హరిజనవాడలో ఎన్ఆర్ఇజిఎస్ జాతీయ ఉపాధి హామీ పథకంలో పనులు లేక బాధకార్మికులు రాలేదని కొంతమంది తెలియజేశారు అధికారులతో మాట్లాడి వారికి పరిష్కార మార్గం చూపడం జరిగిందన్నారు. అర్హులైన వారికి నూతన పెన్షన్లు మంజూరు చేయాలని అంతేకాకుండా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి 10 నెలలు గడుస్తున్నా సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయలేదని వెంటనే పథకాలు అమలు చేయాలని ప్రజలపై ట్రూ అప్ ఛార్జీలు భారాన్ని రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి తలారి సురేష్, మండల కమిటీ సభ్యులు రామచంద్రయ్య, చంపాల సుబ్బరాయుడు, కుడుముల మోహన్ రావు, దాసరి ఏడుకొండలు, పంది సురేంద్రబాబు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ముత్తుకూరు : మండలం బ్రహ్మదేవం పంచాయతీలోని లింగాయపాలెం అరుంధతీయవాడలో సిపిఎం ప్రజా చైతన్య యాత్రలో భాగంగా శుక్రవారం నాయకులు ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గోగుల శ్రీనివాసులు, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు గడ్డం అంకయ్య, బ్రహ్మదేవం శాఖ కార్యదర్శి పెద్దపూడి వెంకయ్య, బ్రహ్మదేవ మోహన్ రావు, షేక్ మస్తాన్‌సా, రావూరు మాబయ్య తదితరులున్నారు.



ముత్తుకూరులో...



నెల్లూరు రూరల్‌లో...

ప్రజాశక్తి-నెల్లూరు : సిపిఎం నెల్లూరు రూరల్ మండల కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రజా చైతన్య యాత్రల 7వ రోజు పర్యటనలో భాగంగా మండలంలోని దేవరపాలెం గ్రామంలో శుక్రవారం నాయకులు పర్యటించారు. ఈ పర్యటనలో పాల్గొన్న సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఆలూరు తిరుపాలు మండల కార్యదర్శి పూడిపర్తి జగన్ మాట్లాడుతూ దేవరపాలెం గ్రామంలో రాళ్లరేవు వద్ద పెద్ద వాగు ఏర్పడి ఉందని దానికి వంతెన ఏర్పాటు చేస్తే గ్రామస్తులు తమ మాగాణి పొలాల్లోకి వెళ్లేందుకు, శ్మశానానికి పోయేందుకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కాబట్టి వెంటనే రాళ్లరేవుకు పోయే దారిని జంగిల్ కటింగ్ చేయించి వాగుకు వంతెన ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే గ్రామంలో డ్రైనేజీ కాలువలు లేక పోవడంతో తమ ఇళ్ళ ముందు గుంతలు ఏర్పాటు చేసుకొని డ్రైనేజీ వాటర్ ఎత్తిపోసుకుంటున్నారని దాంతో ఏర్పడుతున్న దోమల వల్ల మలేరియా, డెంగీ లాంటి విష జ్వరాల బారిన పడే ప్రమాదం ఉందని కాబట్టి వెంటనే డ్రైనేజీ కాలువలను నిర్మించాలన్నారు. నరసింహకొండ ప్రాంతాన్ని కొండపైన ఉన్న కోనేరులను శుభ్రం చేయించి ప్రజలకు అందుబాటులోకి తెచ్చి నరసింహకొండ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలన్నారు. కార్యక్రమంలో నెల్లూరు మండల కమిటీ సభ్యులు ఎంవి రమణ, శ్రీపతి వెంకయ్య, మరిమేసి కామాక్ష య్య ఎగ్గోలు భాస్కర్, గడ్డం వెంకటేశ్వర్లు, బండి మురళి, కొర్ర పాపయ్య, చిన్న వెంకయ్య, కోటపూడి సుబ్రహ్మణ్యం, పసల వెంకట రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

బాబు మృతికి జర్నలిస్ట్ క్లబ్ సంతాపం

ప్రజాశక్తి-కావలి



సీనియర్ జర్నలిస్ట్ ఆవుల వెంకటేశ్వర్లు (బాబు) (59) అకాల మరణంకు చింతిస్తూ శుక్రవారం కావలి పట్టణంలోని జర్నలిస్ట్ క్లబ్లో ఘనంగా నివాళులర్పించారు. బాబు ఆంధ్రభూమి దినపత్రికలో చిరకాలం పనిచేసి అనంతరం సదా మీకోసం దినపత్రికలో పనిచేస్తూ సీనియర్ జర్నలిస్ట్గా జర్నలిస్ట్ క్లబ్ ఏర్పాటులో కూడా కీలకంగా వ్యవహరించారన్నారు. ఆయన అకాల మరణం పాత్రికేయ రంగానికి తీరని లోటు అని పలువురు సీనియర్ జర్నలిస్టులు అభిప్రాయం వ్యక్తం చేశారు. బాబు ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన కుటుంబ సభ్యులకు మనో ధైర్యం కల్పించాలని కోరారు. స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో సీనియర్ జర్నలిస్ట్ "సదామీకోసం" విలేకరి ఆవుల వెంకటేశ్వర్లు అందరికీ చిరపరిచితులు, ఆవుల వెంకటేశ్వర్లు (బాబు) ఈరోజు అనారోగ్యంతో నెల్లూరు కిమ్స్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్లో అకాల మరణం చెందారు. కావలి కలువాయి కళ్యాణ మండపం దగ్గర వారి గృహంలో బాబు మృతదేహాన్ని స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు సందర్శించి, అశ్రునయనాలతో శ్రద్ధాంజలి ఘటించారు. వివిధ స్వచ్ఛంద సంస్థల గౌరవ అధ్యక్షులు షేక్.బాషా, వాయిస్ ఆఫ్ ముస్లిం మైనారిటీ మొఘల్ సలీం బేగ్, హెల్ప్ సేవ సంస్థ ఘనిబాషా, ఈనాడు సుబ్బారావు, అభయం నారాయణ, షోకాన్ భాస్కర్, బాషా తదితరులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.



చెంచలబాబు యాదవ్ నివాళులు..

ప్రజాశక్తి-ఉదయగిరి : సీనియర్ జర్నలిస్ట్ ఆవుల.వెంకటేశ్వర్లు (బాబు) కావలిలో గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందడం తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ జెడ్పీ మాజీ చైర్మన్ పి.చెంచలబాబు యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఆవుల వెంకటేశ్వర్లు సీనియర్ జర్నలిస్టుగా జర్నలిజంలో అనేక పత్రికలలో పనిచేయడం జర్నలిజానికి మంచి పేరు తెచ్చిన ఆవుల వెంకటేశ్వర్లు మరణానికి సంతాపం వ్యక్తం చేసి వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అలాగే ఉదయగిరి పట్టణంకు చేరుకొన్న ఆయన మత దేహాన్ని వద్దకు వివిధ పార్టీ నాయకులు పత్రిక మిత్రులు బంధువులు కుటుంబ సభ్యులు పాల్గొని ఘన నివాళులర్పించారు.

ప్రభుత్వాధికారులే పర్యవేక్షించాలి

ప్రజాశక్తి-గుడ్లూరు రూరల్



సెన్సార్ ట్రాకింగ్ సిస్టమ్ను ప్రభుత్వ ఆర్టిఏ అధికారులే పర్యవేక్షించే విధంగా చూడాలని ఆటో కార్మిక సంఘం మండల కమిటీ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వాహనాల ఫిట్నెస్ సర్టిఫికెట్లకు సంబంధించి సెన్సార్ ట్రాకింగ్ సిస్టమ్ను అమలు చేసే దాంట్లో భాగంగా నెల్లూరు జిల్లా కేంద్రంలోని ముత్తుకూరు మండలం దగ్గర కప్పలదురు గ్రామంలో ట్రాక్ నిర్మించిందని తెలిపారు. జిల్లాలో ఉన్న మారుమూల మండలం నుంచి కూడా అన్నిరకాల వాహనాలు ఇక్కడికే వచ్చి ఫిట్నెస్ సర్టిఫికెట్లు తీసుకోవాల్సిన పద్ధతిని ఏర్పాటు చేశారన్నారు. ఈ పద్ధతి వల్ల జిల్లా కేంద్రానికి దూరంగా ఉండే దాదాపు 120 కిలోమీటర్ల నుండి ఆటో కార్మికులు గానీ ట్యాక్సీ కార్మికులు గానీ లారీ కార్మికులు గానీ అందరు కూడా వాళ్ళ వాహనాలను జిల్లా కేంద్రానికి తీసుకొచ్చి ఫిట్నెస్ చేపించుకోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. దానివల్ల వాహన యజమానులకు విపరీతమైన ఆర్థిక ఇబ్బందులతో పాటు ఒక్క రోజులోనే వాహనాలన్నింటికీ ఫిట్నెస్ సర్టిఫికెట్లు వస్తాయనే భరోసా కూడా లేదని తెలిపారు. ఈ పద్ధతి వల్ల వాహన యజమానులు ఇబ్బందులు పడే పరిస్థితి ఉందన్నారు. కాబట్టి తమ విజ్ఞప్తిని పరిశీలించి సంబంధిత అధికారులు గతంలో నెల్లూరు జిల్లా పరిధిలో ఉన్న కందుకూరు కార్యాలయంలో ఏ విధంగా ఫిట్నెస్ సర్టిఫికెట్లు ఇస్తున్నారో.. ఆ విధంగానే అన్ని కార్యాలయాల్లోనే సెన్సార్ ట్రాకింగ్ సిస్టమ్ను ఏర్పాటు చేసి వారి ద్వారా వాహనదారులకు ఫిట్నెస్ సర్టిఫికెట్లు ఇవ్వాల్సిందిగా కోరుతున్నామన్నారు. ఈ మేరకు గుడ్లూరు మండలంలోని ఆటో వర్కర్స్ యూనియన్ తరఫున విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. అంతేకాకుండా సెన్సార్ ట్రాకింగ్ సిస్టమ్ను ప్రయివేట్ ఏజెన్సీలకు అప్పగించడం వల్ల భవిష్యత్తులో ఉన్నటువంటి అన్ని అంశాలను ఇంప్లిమెంట్ చేస్తే ఆ ప్రాంతంలో వాహనదారులకు ఆ వాహనాలకు ఉన్న లోపాలను సరిదిద్దుకోవడానికి వాహనాల షోరూములు గానీ అలాగే స్పేర్ పార్ట్స్ గానీ దొరకడం కష్టంతో కూడిన పని అని తెలిపారు. కాబట్టి ఒక్క వాహనం ఎఫ్సి కావాలంటే ఆర్థిక ఇబ్బందులతో పాటు రోజుల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి ఉందన్నారు. కావున సెన్సార్ ట్రాకింగ్ సిస్టమ్ను ప్రభుత్వ ఆర్టిఏ అధికారులే పర్యవేక్షించే విధంగా చూడాలని నెల్లూరు జిల్లా ఆటో కార్మిక సంఘం గుడ్లూరు మండల కమిటీ తరఫున విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.

సినీ దర్శకుడు ఆదిత్యకు పురస్కారం

ప్రజాశక్తి-కావలి



నిత్య ప్రయోగశీలి విలక్షణ దర్శకుడు డాక్టర్ పి సి ఆదిత్యను మరో అత్యున్నత పురస్కారం వరించింది. భువనేశ్వర్ ఒడిస్సాకు చెందిన ప్రముఖ సేవాసంస్థలైన సంస్థ "పీపుల్ఫుల్ ఇండియా" వారు దర్శకుడు పిసి ఆదిత్యను ప్రముఖ వ్యక్తిగా గుర్తించి "మహాత్మా గాంధీ స్మారక విశిష్ట" వ్యక్తిగా అవార్డును ప్రకటించారు. శుక్రవారం ఈ విశిష్ట పురస్కారాన్ని తెలంగాణ ప్రభుత్వ టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ టిపిసిసి ప్రచార కమిటీ కో కన్వీనర్ ప్రముఖ సంఘ సేవకులు "శ్రీఉప్పల శ్రీనివాస గుప్తా" చంద్ర ఆదిత్యను సత్కరించి, మహాత్మా గాంధీ స్మారక పురస్కారం అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా శ్రీనివాస గుప్తా మాట్లాడుతూ గత 30ఏళ్లుగా సినీరంగంలో ఎన్నో ప్రయోగాత్మక చిత్రాలు రూపొందించి ఎందరో నూతన కళాకారులను ప్రోత్సహిస్తున్న ఆదిత్య సినీ రంగానికి మరిన్ని సేవలు అందించి ఎన్నో అవార్డులు అందుకోవాలన్నారు. ఈ విశిష్ట పురస్కారం అందుకున్న ఆదిత్య స్పందిస్తూ తన ఈ విజయాలకు వెన్నంటి ఉండి మరి కొంతమంది నూతన నటీనటులను సానుకూలంగా ప్రోత్సహిస్తానని హామీ ఇచ్చారన్నారు. ఈ సందర్భంగా మిత్రులు, గురువుగార్లు ఆయన చంద్ర ఆదిత్యకు కావలికి చెందిన నంది అవార్డు గ్రహీత, డాక్టర్ పొద్దు నాగరాజు శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు.

జిల్లా జడ్జి ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-వింజమూరు



మండల పరిధిలోని రామలింగాపురం గ్రామంలో వెలసి ఉన్న శ్రీ కామాక్షి సమేత రామలింగేశ్వర స్వామిని శుక్రవారం జిల్లా జడ్జి గీత దంపతులు శ్రీకామాక్షి దేవి శ్రీరామలింగేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాంత్ స్వామి జిల్లా జడ్జి గీత దంపతులకు ఆలయ మర్యాదలతో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు.

'ఉపాధి' పనులు పరిశీలన

ప్రజాశక్తి-అనంతసాగరం



ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న పుల్లయ్య

మండలం లోని మంగుపల్లి, చిలకలమర్రి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను శుక్రవారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మంగళ పుల్లయ్య, సిపిఎం మండల కార్యదర్శి అన్వర్‌బాషా పనులను పరిశీలించారు. ఉపాధి హామీ కూలీలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. కూలీలు వారి సమస్యలను నాయకుల దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మంగళ పుల్లయ్య మాట్లాడుతూ ఉపాధి హామీ పనులు చేసిన కూలీలకు 8వారాలుగా బకాయి డబ్బులు ఉన్నాయని, ఒక వైపున పని ప్రదేశంలో తాగునీరు, ప్రథమ చికిత్స కిట్ లాంటి వసతులు కల్పించాలనీ చెబుతున్న ఎక్కడ కూడా కల్పించడం లేదు. అదే విధంగా కూలీలకు 300 రూపాయలు కూలీ వచ్చే విధంగా ఉండాలని చట్టం చెబుతున్న రూ.200, రూ.150 చొప్పున పడుతున్నాయన్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటం వల్ల మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఇవ్వాలన్నారు. 200రోజు పనులు కల్పిచాలనీ, రూ.600 కూలీల డబ్బులు పెంచాలన్నారు.

మరుగుదొడ్లు లేక ఇక్కట్లు..

- బస్టాండ్ సెంటర్‌లో ప్రయాణికుల అవస్థలు
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-వలేటివారిపాలెం



మరుగుదొడ్లు లేని బస్టాండ్ ప్రాంతం

నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉండే వలేటివారి పాలెం బస్టాండ్ సెంటర్ మూడు రోడ్ల కూడలిలో ప్రయాణికులకు మరుగుదొడ్లు లేకపోవడంతో ప్రయాణికులతోపాటు స్థానిక మహిళా వ్యాపారస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల కేంద్రం కావడంతో నిత్యం వందలాది వాహనాలు రద్దీగా తిరుగుతుంటాయి. మండలం చుట్టుపక్కల గ్రామాలు, మండల కేంద్రానికి అధిక సంఖ్యలో మహిళలు వస్తుండడంతో అవస్థలు పడుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న వ్యాపార దుకాణాలు అభివృద్ధి చెందుతున్నాయి. కానీ దుకాణాలలో వస్తువులు కొనుగోలుకు వచ్చిన మహిళలు, ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు మూత్ర విసర్జన చేయాలంటే నరకయాతన అనుభవించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రతిరోజు సాయంత్రం సమయాన హైదరాబాద్, బెంగళూరు ప్రత్యేకంగా బస్సులు వస్తుంటాయి. ఆ సమయంలో బస్టాండ్ కూడలిలో బస్సులు నిలిపినప్పుడు సుదూర ప్రాంతాల నుండి వచ్చిన ప్రయాణికులు మూత్ర మల విసర్జన చేయాలంటే మరుగుదొడ్లు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిరు వ్యాపారాలు చేసే మహిళలు ప్రయాణికులు అధికారులకు చెప్పినా చలనం లేదు. పాలకులు పట్టిపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. అధికారులు త్వరితగతిన స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు, మహిళలు విజ్ఞప్తి చేస్తున్నారు.

బీద రవిచంద్రకు సన్మానం

ప్రజాశక్తి-దుత్తలూరు



రెండో సారి ఎంఎల్‌సిగా నియమితులైన బీద రవిచంద్రను విజయవాడలోని ఆయన అతిథి గృహంలో ఉదయగిరి నియోజకవర్గ టిడిపి అధికార ప్రతినిధి, వాల్మీకి సాధికారిక కన్వీనర్ చల్లా ప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిసి ప్రత్యేక అభినందనలు తెలిపి సన్మానించి జ్ఞాపిక అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాల అభివృద్ధికి ఒక్క టిడిపికే సాధ్యమని, అందుకు ఉదాహరణ బీద రవిచంద్ర అని అలాంటి నాయకుడికి రెండోసారి తెలుగుదేశం ప్రభుత్వం ఎంఎల్‌సిగా ఇవ్వడం చాలా ఆనందకర విషయమని అన్నారు. అలాగే మండలంలో పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ నిత్యం పార్టీ కార్యక్రమాలను పథకాలను పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లే ఏకైక వ్యక్తి చల్లాప్రసాద్ అని ఆయన అభిమాన సంఘం తెలిపింది.



కొనుగోలు కేంద్రంలో పరిశీలన

ప్రజాశక్తి-బిట్రగుంట

బోగోలు మండలం చెంచులక్ష్మిపురంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని సివిల్ సప్లయి డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సివిల్ సప్లయి డైరెక్ట్ పట్టాభిరామిరెడ్డి రైతులతో మాట్లాడుతూ రైతులు ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ధాన్యం అమ్మిన 24 గంటల్లోనే రైతుల ఖాతాలో డబ్బులు వేస్తామని తెలిపారు. రైతులు ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకునే విధంగా సిబ్బంది కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ సురేష్ బాబు, ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రం సిబ్బంది, రైతులు నాయకులు పాల్గొన్నారు.

అధ్వానంగా రోడ్డు..



దుమ్ముతో నిండిన రోడ్డు

ప్రజాశక్తి-వరికుంటపాడు

ప్రకాశం – పామూరు నుంచి నెల్లూరు జిల్లా విరువూరు వెళ్లే రోడ్డు దారుణంగా ఉండి.. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వైఖరితో ప్రయాణం ఇబ్బందికరంగా ఉంటుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దెబ్బతిన్న రోడ్లకు అతుకులు వేసేందుకు ప్రభుత్వం ఇటీవల నిధులు మంజూరు చేసింది. అందులో భాగంగా పని పూర్తి చేసేందుకు ఒప్పుకున్న కాంట్రాక్టర్ రోడ్డు వెంట గుంతల్లో చిప్స్ నింపి వదిలేయడంతో వాహనదారులకు ప్రయాణం ప్రాణాంతకంగా మారింది. రోడ్డుపై ఏ చిన్నపాటి వాహనం వెళ్లినా దుమ్ముతో నిండిపోవడంతో దారి కనిపించక ఎదురుగా వచ్చే వాహనాలు గుర్తించలేక వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ద్విచక్ర వాహనాలపై వెళ్లేవారు అయితే కళ్ళల్లో దుమ్ము పడుతుండడంతో ఒక కిలోమీటర్ కూడా వెళ్లలేని పరిస్థితులు ఎదురయ్యాయని వాహనదారులు వాపోతున్నారు. నెలలు గడిచినా ఇంతవరకూ రోడ్డు నిర్మానం పూర్తి కాకపోవడంతో స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్ని కథనాలు రాసినా.. ఎన్నిసార్లు అధికారులకు దృష్టికి తీసుకెళ్లినా.. కనీసం స్పందన లేకపోవడం శోచనీయమని తెలియజేస్తున్నారు. విరువూరు వైపు నుంచి సుమారు 10, 15 గ్రామాల వాసులు వెళ్లే రోడ్డు కనుక సంబంధిత శాఖ అధికారులు త్వరితగతిన స్పందించి ప్యాచ్‌వర్క్ త్వరగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రమాదాలకు నిలయంగా రోడ్డు..

గొల్లపల్లి ఉదయ్, విరువూరు



రోడ్డు మరమ్మతుల నిమిత్తం కంకర పరచి కాంట్రాక్టర్ మిన్న కుండి పోవడంతో మహిళలతో ద్విచక్రంలో వెళుతుండగా కంకర స్లిప్పై కింద పడిపోతున్నాం. ఈ రోడ్డుపై ప్రయాణం ప్రమాదాలకు నిలయంగా మారింది. మహిళలు ఒకవైపు కూర్చోవడం వల్ల రోడ్డు సక్రమంగా లేక పోవడంతో పడిపోయే గాయాల పాలవుతున్నారు. పెద్ద ప్రమాదాలు చోటు చేసుకోక ముందే అధికారులు రోడ్డు మరమ్మతు పనులు పూర్తి చేయాలి.

అధికారులు స్పందన కరువు..

గుబిలి శశికుమార్, విరువూరు



గుంతల మయంగా ఉన్న రోడ్డును చెడగొట్టి చిప్స్ వేసి వదిలేయడంతో ద్విచక్ర వాహనదారులు రోడ్డుపై వెళ్లలేక పోతున్నారు. దానికి తోడుగా ఎదురుగా ఏదైనా పెద్ద వాహనం వస్తే ఆ దుమ్ముతో మరొక వాహనం కనిపించక ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉంది. రాత్రి సమయంలో వాహనం అదుపుతప్పి వాహనదారులు పడిపోతున్నారు. అధికారులు దృష్టికి తీసుకెళ్లినా వారినుంచి స్పందన కరువైపోయింది.

ఎంపిటిసి మృతి

ప్రజాశక్తి-బిట్రగుంట



బోగోలు మండలం జక్కపల్లి గూడూరు ఎంపిటిసి సభ్యులు, అనంత బొట్ల వారి కండ్రిక మాజీ సర్పంచ్ సదనాల మాధవ శుక్రవారం మృతి చెందారని, ఆయన మతి వారి కుటుంబ సభ్యులకు, వారి గ్రామానికి తీరని లోటు అని, ఆయనకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యం కల్పించాలని, బోగోలు మండల వైసిపి అధ్యక్షులు మద్దిబోయిన వీరరఘు సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా వారి మృతదేహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అక్కరాజువారి కండ్రిక గ్రామంలో ఉన్న ఎంకెఎస్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల కరస్పాండెంట్ సాధనాల మనోహర్ నాయుడు మాధవరావుకు సంతాపం తెలిపారు. సాధనాల మాధవ రావు మృతికి పలువురు రాజకీయ నేతలు, మండల ఎరువుల దుకాణదారులు సంతాపం తెలిపారు.

వైభవంగా కళ్యాణోత్సవం

ప్రజాశక్తి-బిట్రగుంట

కొండ బిట్రగుంట శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం కల్యాణోత్సవాన్ని కమనీయంగా నిర్వహించారు. స్వామివారి దివ్య కళ్యాణ మహోత్సవాన్ని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సమక్షంలో వేద పండితులు కన్నుల పండువగా నిర్వహించగా, వేల సంఖ్యలో విచ్చేసిన భక్తులు స్వామి వారి కళ్యాణాన్ని కన్నులారా వీక్షించారు. గోవింద నామస్మరణలతో కొండ బిట్రగుంట మారుమోగింది. శాసన మండలి సభ్యులు బీద రవిచంద్ర, కావలి శాసన సభ్యులు దగుమాటి వెంకట కృష్ణారెడ్డితో కలిసి రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రభుత్వ లాంఛనాలతో స్వామి, అమ్మవార్లకు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పట్టు వస్త్రాలు సమర్పించారు. అంతరం అశేష భక్తజనంతో కలిసి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారి దివ్య కళ్యాణ మహోత్సవ వేడుకలోని అద్భుతమైన ప్రతి ఘట్టాన్ని కూడా వేద పండితులు భక్తులకు సాక్షాత్కరింపచేయగా, మంత్రి భక్తిశ్రద్ధలతో వీక్షించారు. కళ్యాణోత్సవం అనంతరం స్వామి, అమ్మవారిని మంత్రి, ఎంఎల్‌సి, ఎంఎల్ఎలు దర్శించుకున్నారు. అనంతరం వేద పండితులు వేద ఆశీర్వచనాలతో ఘనంగా సత్కరించి ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి ఎల్లప్పుడూ దేవాదాయ శాఖ తరపున సంపూర్ణ సహకారం అందిస్తామని తెలిపారు. కొండ బిట్రగుంట ప్రసన్న వెంకటేశ్వర స్వామిని దేవాదాయ శాఖ మంత్రిగా మూడోసారి దర్శించుకోవడం, బ్రహ్మోత్సవాల్లో పాల్గొనడం అదృష్టం, పూర్వజన్మ సుకతంగా చెప్పారు. కొండ బిట్రగుంట ఆలయ అభివృద్ధికి ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, ఎంఎల్ఎ కృష్ణారెడ్డి ఎంతోకృషి చేస్తున్నారని, వారికి దేవాదాయ శాఖ తరపున బిట్రగుంట ఆలయ పరిధిలో ఏ అభివృద్ధి కార్యక్రమానికైనా అన్నివిధాల సహకారం అందిస్తామన్నారు. రూ.12.50 కోట్లతో ఎంఎల్ఎ కృష్ణారెడ్డి ఆలయ అభివృద్ధి కార్యక్రమాలకి శ్రీకారం చుట్టారని, అన్ని పనులు కూడా టెండర్లు పూర్తయి మొదలవుతున్నట్లు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో కళ్యాణ మండపం, ఇఒ కార్యాలయం, విశ్రాంతి గదుల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. తిరుమల తరువాత దక్షిణాదిన బిట్రగుంట క్షేత్రం అత్యంత ప్రసిద్ధి చెందినదని, ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసి భక్తులకు మెరుగైన సేవలు అందిస్తామన్నారు. శాసనమండలి సభ్యులు బీద రవిచంద్ర మాట్లాడుతూ 27యేళ్ల క్రితం రెండు లక్షల రూపాయలతో శిథిలావస్థలో ఉన్న ఆలయంలో అభివృద్ధి పనులు ప్రారంభించామన్నారు. ఆనాటి నుంచి నేటి వరకు కూడా ప్రభుత్వాల సహకారంతో బిట్రగుంట ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. కావలి ఎంఎల్ఎ కృష్ణారెడ్డి ఎన్నికైనప్పటి నుంచి ఆలయ అభివృద్ధికి నిరంతరం ఆలోచన చేస్తూ అభివద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. దేవాదాయ శాఖ మంత్రిగా ఆనం రామ నారాయణ రెడ్డి సారథ్యంలో ఒక మాస్టర్ ప్లాన్ ప్రకారం ఆలయాన్ని అభివృద్ధి చేసే కార్యక్రమాల్లో తాను కూడా భాగస్వామ్యం కావడం భగవదనుగ్రహంగా భావిస్తున్నట్లు తెలిపారు. 2028 బ్రహ్మోత్సవాల నాటికి ఆలయంలో శాశ్వతంగా అభివద్ధి పనులు పూర్తి చేస్తామని తెలిపారు. కావలి శాసనసభ్యులు దగ్గుబాటి వెంకట కృష్ణారెడ్డి మాట్లాడుతూ తన గురుతుల్యులు, దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డితో కలిసి బ్రహ్మోత్సవాల్లో పాల్గొనడం, మొదటిసారిగా ఒక దేవాదాయ శాఖ మంత్రి బిట్రగుంట వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు విచ్చేయడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. రూ.1.85 కోట్లతో ఆలయానికి కాంపౌండ్ వాల్, రూ.2.65 కోట్ల టిటిడి నిధులతో గాలిగోపురం నిర్మాణ పనులు త్వరలోనే మొదలుపెట్టనున్నట్లు తెలిపారు. కళ్యాణ కట్ట, కళ్యాణ మండపం, అన్నదాన సత్రం నిర్మాణాలు మొదలైన ఆలయ అభివృద్ధి పనులకు పెద్దఎత్తున దాతలు ముందుకొస్తున్నారని, వారందరి సహాయ సహకారాలతో, దేవాదాయ శాఖ నిధులతో బిట్రగుంట ఆలయాన్ని సంపూర్ణంగా అభివృద్ధి చేయనున్నట్లు స్పష్టం చేశారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ జనార్ధన్ రెడ్డి, టిడిపి మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరరావు, సీనియర్ నాయకులు రావి విజయ్ యాదవ్, వెంకటేశ్వర్ రెడ్డి, ఇఒ అరవ రాధాకృష్ణ, దేవాదాయ శాఖ అధికారులు, పోలీస్ అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



బీద, ఆనం, క్రిష్ణారెడ్డిలను సన్మానిస్తున్న దృశ్యం